

# శ్రుతి తప్పిన జీవితాలు

క్లబ్బు నుంచి రాత్రి తొమ్మిది గంటలకు గదికి తిరిగి వచ్చాను. జమాను రంగయ్య సాయంత్రం వచ్చిందంటూ జాబు ఇచ్చాడు. అరుణ నుంచి.

ఏనాటిది అరుణ?

తన జీవితోషస్సులో వికసించిన యవ్వనపు తొలి రేకులతో, ఆశను పెనవేసుకొని నా ముందు నిలిచి, "ఈ మనస్సు, వాక్కు, కర్మ మీకే అర్పితం చేస్తున్నాను" అంది అరుణ.

"మురారీ! ఈ మానవులు ఎందుకు పుట్టి ఎందుకు గిట్టుతున్నారో ఎరుగను. కాని నేను పుట్టింది, నీకు సమర్పితం కావడానికే అని మాత్రం తెలుసు" అంది.

లౌకిక జీవితపు పరిధులు, సంఘం గీచిన గిరులు, స్వార్థపరత్వపు సమగ్రత నన్నొక రాక్షసుణ్ణి చేశాయి. ఆ శిరీష కుసుమ కోమల మనోహర సౌందర్యలహరి మీదుగా, నా ధూళి ధూసరిత పాదాలతో నడిచి పోయాను. కర్కశంగా ఆ మధుర భావాల ప్రోవును మసిచేసి వేశాను.

అరుణ నేత్రాల నుంచి రాలి చినికిపోతున్న కన్నీటికి నిర్లక్ష్యంగా, దూరంగా నడిచి పోయాను. అరుణ ఏమయిందో? పదిహేను నిండు సంవత్సరాల అనుభవాల అశ్రు కణాలు కరిగి, కదలి పోయాయి. ఏనాటిదో అయిపోయింది అరుణ.

జాబు విప్పాను.

"మురారీ!

ఎవరు నీ జీవిత మార్గం నుంచి నిష్క్రమిస్తే నీవు సుఖపడతావో, నాకు

తెలిపావు. ఆ నేను ఈ జీవితానికి నీ నుండి దూరంగా మెలగాలనే ప్రయత్నించాను. కాని విధి నన్నింకా వంచిస్తూంది. జీవితపు విలువలతోను, వ్యక్తుల విలువలతోను మభ్యపెట్టి ఈ విధి నేనేది చేయగూడదనుకుంటున్నానో దాన్నే చేయిస్తూంది. మరోసారి ఈ అరుణకు నిన్ను అర్థించక తప్పడం లేదు.

నీకు తెలియదనుకొంటాను. కరుణాకరం విశాఖపట్టణంలో పేరొందిన లాయరు. మంతనానికి, కరుణకు, దయకు ఆయన గర్వం తెచ్చారు. ఇంతకూ నేను చెప్పవచ్చేది, వారు గత మూడు సంవత్సరాలుగా రవంత కరుణలేని వ్యాధిచే పీడింపబడుతున్నారు. తిరగని ఆస్పత్రి, తినని మందు లేదు. మద్రాసు, బెంగుళూరు, ఊటీ, జబల్పూరు... ఒకటేమిటి, ఈ దేశంలోని అన్ని ప్రఖ్యాతమైన ఆస్పత్రులు ఆయనను పరీక్షించి, పెదవి విరిచాయి. ఆయనకున్న ఆస్తి పాస్తులు, ఆర్జించిన కీర్తి ప్రతిష్ఠలు అన్నీ వెలనిలిచి ఆయనను దక్కించుకోలేక పోతున్నాయి. సరిగా మూడు రోజుల క్రితం రాయవేలూరు హాస్పిటల్‌లో ఉండగా 'నా అంతిమ దినాలు విశాఖలోనే గడపాలి' అన్నారాయన.

బద్దలు కానున్న హృదయాన్ని పొదివి పట్టుకొని, వారి చివరి కోరికను తీర్చాలని బయలుదేరాను. డిస్‌ఛార్జి చేస్తూన్న డాక్టరు 'గుంటూరులో డాక్టరొకరు కాన్సర్ స్పెషలిస్టు మొన్ననే విదేశాలకు వెళ్ళి వచ్చారు. ఆయనను చూడండి. ఫలితం ఉండవచ్చు' అని చెప్పారు.

నాలో మాసిపోతున్న ఆశలు మళ్ళీ ప్రభవించాయి. 'ఎందుకు ఈ నిష్ఫల, నిరంతర శ్రమ? ఇకనైనా నన్ను ప్రశాంతంగా ఎదురుచూడనివ్వు' అన్నారాయన.

ఆ వ్యాధితో అంతగా విసిగిపోయారాయన. గుంటూరులో దిగడం వీలుపడక విశాఖ నిన్న వచ్చేశాము. వాకబు చేయగా ఆ డాక్టరు మరెవ్వరో కాదు, మురారి అని తెలిసింది. నీవని తెలియగానే ఏమిటో నా ఆశలు చివురించాయి. స్వార్థం ఎంతటిదో! పదిహేను సంవత్సరాల క్రితం చేసుకున్న నిర్ణయాన్ని భగ్నంచేసి ఈ జాబు వ్రాస్తున్నాను.

ఈపాటికి నీకు తెలిసి ఉంటుంది అనుకొంటాను. కరుణాకరం నా భర్త. వెంటనే వచ్చి ఆయనను రక్షించు. నీ ఋణాన్ని కొన్ని జన్మలలో నీ ఇంట దాసినై



పుట్టి తీర్చుకొంటాను.

నీవు తప్పక వస్తావనే విశ్వాసం నాకు ఉంది.

- అరుణ."

జాబుతోపాటు బాంక్ చెక్కు ఉంది.

పదిహేను సంవత్సరాల క్రిందటి అరుణ నాజీవితంలో మళ్ళీ ప్రత్యక్షమవుతుందని ఏనాడూ ఊహించలేకపోయాను. జాబు చదివిన కొంతసేపటి వరకు మామూలు మనిషిని కాలేకపోయాను.

జమాను రంగయ్య, "బాబూ! లైట్లు పోయాయి. కొవ్వొత్తి వెలుగులోనే భోజనం చేయాలి" అనేంతవరకు లైట్లు పోయినట్లు గ్రహించలేకపోయాను. రంగయ్య వెలిగించిన కొవ్వొత్తి నిశ్చలంగా వెలుగుతున్నది. అరుణ జాబులోని 'నీవు వస్తావనే విశ్వాసం నాకుంది' అనే మాటలు గింగురుమంటున్నాయి. అరుణకు నామీద విశ్వాసమా? ఒకనాడామె విశ్వాసాన్ని దారుణంగా హత్య చేశాను. ఇంకా ఎందుకామెకీ విశ్వాసం?

నా స్మృతి గతంవైపొక్కసారి తిరిగింది.

పదిహేను సంవత్సరాల క్రిందట నేను మెడిసిన్ పూర్తిచేసి కొత్తగా గుంటూరులో డాక్టరుగా చేరిన రోజులు. ఒక్కణ్ణి. బ్రహ్మచారిని. ఒక మేడపై గదిలో ఉంటూ ఉండేవాడిని. అదే మేడ క్రింది భాగంలో ఉంటూ ఉండేది లలితమ్మగారు. లలితమ్మగారు మిడిల్ స్కూల్లో టీచరు. లలితమ్మగారి కూతురే అరుణ. బి.ఎ. చదువుతూ ఉండేది.

అరుణను చూచినప్పుడెల్లా ఆమెను సృష్టించి ఆపై సౌందర్య రచన మానుకొన్నాడేమో బ్రహ్మ అనిపించేది. సౌందర్యం, సౌశీల్యం ఒంటిగా ఉండవు అంటారు కొందరు. అరుణను చూచాక ఆ అభిప్రాయాన్ని మార్చుకోవలసి వస్తుందేమో! ఆమె మాట్లాడితే వినయాన్ని చూచినట్లుండేది. ఆమె నవ్వితే వెన్నెల విరబూచి నట్లుండేది.

లలితమ్మ గారికే, ఆ రక్తపు పోటు అంటూ లేకుంటే అరుణలాంటి వ్యక్తిని కలుసుకొనే అవకాశం నాకు ఈ జన్మకు కలిగేదా అనిపిస్తుంది. అరుణ వివేక వివేచనాలలో ఎంతటి శ్రీమంతురాలో ఆర్థికంగా అంతటి నిరుపేద. లలితమ్మగారి జీతం రాళ్ళ మీదనే వారి రెండు జీవితాలు, అరుణ చదువు.

"నాయనా! భగవంతు డెంతటి దయామయుడో! రాతిలోని చిరుకప్పకు ఆహారాన్ని అందిస్తాడు. నాలాంటి నిరాధారులకు నీలాంటి వారిని చూపెడతాడు"

అన్నారు లలితమ్మగారు, ఒకనాడు ఇన్‌జెక్షన్ ఇచ్చి వస్తూ ఉండగా. ఆ మరునాడు ఆవిడ తీసుకొనవలసిన మందులు ఇచ్చి వస్తూ ఉండగా, "నాయనా! ఎందుకు నీకీ శ్రమ" అన్నారామె. ఏమని చెప్పను?

విధి వక్రించింది. లలితమ్మగారు అంతిమశ్వాస విడవడానికి సిద్ధమయ్యారు. అరుణ విచలిత అయి శూన్యంలోకి చూడడం మొదలు పెట్టింది.

"నాయనా! ఈ ప్రపంచం అంటే ఏమిటో తెలియకుండా పెరిగింది. ఈ దిక్కులేని పక్షిని వదిలి నా ప్రయాణం సాగిపోతోంది" అన్నారు లలితమ్మగారు, అరుణ నుద్దేశించి మాట్లాడుతూ. ఎక్కడో వినిపించినట్లు వినిపించాయి ఈ మాటలు.

ఆమె చెవి దగ్గరగా వెళ్ళి, "అరుణకు నేనున్నాను. ఆమెను నేను స్వీకరి స్తాను" అని చెప్పాను. ఆమె కనులు క్షణ కాలం వెలిగాయి. శూన్యంలోకి చూస్తున్న అరుణ నా ఒడిలో వాలిపోయి బావురుమంది.

అంతా అయిపోయింది. ఇహం అనే శూన్యాంకం నుండి పరమనే పూర్ణాంకం లోనికి జారిపోయారు లలితమ్మగారు.

అరుణ చదువు ఆపివేసింది.

"మురారీ! నీవనే మేరువును చూచుకొని మళ్ళీ మనిషిని కాగలుగు తున్నాను" అంది అరుణ లలితమ్మగారు పోయిన నెల రోజులకు.

నన్ను ఒకరిద్దరు మిత్రులు అడిగారు -"ఎవరినో అనాథను చేరదీశావట?" అని. వారి ప్రశ్నలో హేళనలు ఎక్కువగా వినిపించాయి. అరుణను కూడ ఎవరో ఏదో అన్నారట.

"మురారీ, ఆలస్యమెందుకు? ఆలస్యానికి అర్థాలు, అపార్థాలు తీస్తారు" అంది అరుణ.

మరునాడు నాన్నగారి నుంచి టెలిగ్రాం వచ్చింది. కారణం తెలియలేదు. వెళ్ళి విషయం తెలుసుకొని అప్పుడే మా వివాహం సంగతి తేల్చుకుని వస్తానని అరుణతో చెప్పి పుసులూరు బయలుదేరాను.

నాన్న అరుణను గురించి తనకు వచ్చిన ఆకాశరామన్న జాబులన్నీ చూపారు.

"నాయనా! స్వతంత్ర వ్యక్తిగా నీకుండే హక్కును త్రోసిరాజనలేను. కాని తండ్రిగా నాకుండే కోరికను తెలియపరచడంలో తప్పులేదనుకొంటాను. అంతే కాదు. సుదూరంలో ఉన్న నీ ఉజ్జ్వల భవిష్యత్తును ఊహించి దాని కోసం చీకటిలో నిన్ను నడిపించుకొంటూ వచ్చిన నాకు హక్కు, బాధ్యత ఉంటాయి. రాజారావుగారి అమ్మాయి చదువుకొంది. ఒక్కతే కూతురు. ఆయన ఎం.ఎల్.ఎ. నిన్ను విదేశాలకు పంపి పైకి తీసుకొని రాగలరు. కోరి వచ్చారు. కాదనకు" అన్నారు నాన్న.

అరుణను పల్లెత్తు మాట అనలేదు నాన్న.

"మురారీ, నన్ను నా తోటివారిముందు గర్వంగా బ్రతుకనివ్వు నాయనా!" అంది అమ్మ.

మామయ్య నన్ను సాయంత్రం తోట పొలం వైపు తీసికొని వెళ్ళారు.

"మురారీ! ఈ తోట పొలం, ఆ ఆవులు చూస్తే నీ మనస్సు ఉప్పొంగుతుంది కదూ?" అన్నారు.

మళ్ళీ ఆయనే అన్నారు: "కానీ నీకు తెలియని విషయం ఒకటి చెప్పనా? అవ్వన్నీ నీ చదువు పేరున తాకట్టులో ఉన్నాయనే విషయం నీకు తెలియదు కదూ?".

"అవునా, మామయ్యా?"

"అవును నాయనా! మీనాన్న తనకున్న సర్వస్వాన్నీ నీకై వెచ్చించారు. ఇక ఆయనలో మిగిలింది ఆ రక్తమాంసాలు, అనాదిగా వస్తున్న కీర్తి ప్రతిష్ఠలు. ఇక వాటిని కాపాడవలసిన బాధ్యత, భారం నీవి. ఆలోచించు మురారీ - అరుణ ఎవరని వివాహమాడతావు? ఎందుకు కోరి కోరి దారిద్ర్య పరిధిలోనికి జారి పోతావు?" అన్నారు.

నాస్థితి అయోమయమయింది.

"చదువు సంస్కారాలకు అర్థం తలిదండ్రులను ఏడిపించడం కాదు" అన్నారాయన.

నేనెన్నో ఆలోచించాను.

"లే వెళదాం! చీకటి పడింది. ఆకాశంమీద చుక్కలూ మొలిచాయి"

అంటూ లేచారు. అనంతదూరంలో వెలిగిపోతూన్న ఆ నక్షత్రాలను చూచే ధైర్యం నాకు లేకపోయింది.

మానవుల నంటిపెట్టుకొని బ్రతుకుతున్న లౌకిక దృష్టి నన్ను స్వాధీనం చేసుకొంది. పుసులూరు నుంచి అరుణకు జాబు వ్రాశాను, నా అశక్తతను తెలియబరుస్తూ.

నాలుగవనాడు తిరిగి గుంటూరు వస్తూ అరుణను చూడగల ధైర్యం లేక ఏదో వంకపెట్టి మామయ్యను వెంట తీసికొని వచ్చాను. అరుణ అనే ఆ దగాపడిన అమాయికను చూచి తట్టుకోగలనా అని భయపడ్డాను.

ఎవరి మోము చూడడానికి నేను పిరికి నయ్యానో, ఆ అరుణ అక్కడ లేదు.

"మురారీ!

నేను, నీ జీవిత మార్గం నుంచి తప్పుకొంటే, నీవు సుఖపడ గలిగితే, నాకంతకన్నా కావలసినదేముంది? ఇప్పటికే నీకు చాలా ఋణపడి ఉన్నాను. ఈ ప్రాణాలు గాలిలో కలువక ముందు నీకు కన్పించకుండా జీవించగలిగితే ధన్యురాల్ని. సెలవు.

- అరుణ"

ఈ జాబును మా మేడ ముందు వేరుశెనగకాయలు అమ్ముకొనే పమిడమ్మకు ఇచ్చి వెళ్ళిందట అరుణ.

ఆనాడలా దూరమయింది అరుణ. ఎటు వెళ్ళిపోయిందో, ఏమయిందో? పదిహేను సంవత్సరాలు దొర్లిపోయాయి. ఈ వ్యవధిలో ఎన్ని అనుభవాలు, ఎన్ని సంఘటనలు.... కాలగతిలో కలిసిపోయాయి!

రాజారావు గారి అమ్మాయి జానకికి, నాకు వివాహమయింది. గుంటూరులో ప్రాక్టీసు పెట్టాను. అదృష్టం కలిసి వచ్చింది. రెండు చేతులా ఆర్జించాను. దురదృష్టం నెట్టుకొని వచ్చింది. ఆ వివాహ జీవితం రెండు నిండు వసంతాలను చూడకముందే జానకి మృత్యువు వాత పడింది. నా డాక్టరీ అనుభవాన్ని వెల పెట్టి జానకిని దక్కించుకోలేకపోయాను. చివరి క్షణంలో జానకి, "ఏమండీ! మనం ఏం

పాపం చేశామని, మనకీ ఎడబాటు?" అంది, దీనంగా నా కళ్ళలోకి చూస్తూ.

నా మనోవీథిలో వృక్షాగ్రం నుంచి రాక్షసత్వమనే వింటి నుంచి విడువబడిన శరాహతితో నేల కూలుతున్న అమాయిక కపోతంలా, తళుక్కున మెరిసింది అరుణ.

జానకి దాటిపోయింది నా నుంచి, నా స్వయంకృతాలకు శాపంలా.

జీవితంలో అనుభవాలనే అశ్రు కణాలు ఇంకిపోయాయి. నిట్టూర్పులను మిత్రుల్లా చూచుకొనడమే మిగిలింది.

నేను సైన్సు పత్రికలలో వ్రాసిన వ్యాసాల కారణంగా విదేశాల నుండి పరిశోధన చేయటానికి అవకాశమొచ్చింది. అంతకన్నా చేయగలిగింది మాత్రం ఏముంది? పరిశోధన పూర్తి చేశాను. గుంటూరు జనరల్ హాస్పిటల్లో ఉద్యోగం అయింది.

ఇన్నాళ్ళకు మళ్ళీ అరుణ ప్రత్యక్షమయింది. అరుణ దగ్గరకు వెళదామనిపించింది. మూడు రోజులు సెలవు పెట్టి తెల్లవారు జామున బండిలో బయలుదేరాను. సాయంత్రానికల్లా విశాఖ స్టేషన్‌లో దిగాను. స్టేషన్‌కు అరుణ కారు తీసికొని వచ్చింది. అరుణే నన్ను ముందు గుర్తించింది.

"మురారీ! నీవు వస్తావనే విశ్వాసం నాకుంది" అంది నిశ్వాసం విడుస్తూ. క్షణ కాలం నిశ్చేష్టుణ్ణి అయ్యాను.

అరుణ! తెల్లటి టెరిలీన్ చీర, పచ్చటి వెల్వెట్ జాకెట్, మెడలో ఒక పేట గొలుసు, కాలికి ఖరీదైన చెప్పులు, కొనదేరిన ముక్కు, నల్లని ఆకాశం లాంటి కేశాలు... అదే అరుణ! కాకుంటే కనుల క్రింద నల్లటి చారలు, అనుభవాలను తెలియబరుస్తూ.

"అదేం అలా చూస్తున్నావ్?" అంది.

గతుక్కుమన్నాను - "అబ్బే! మరేం లేదు" అంటూ కారెక్కాను. అరుణను పొందగలిగిన ఆ అదృష్టవంతుడైన కరుణాకరాన్ని చూడాల నిమనస్సు తొందరపడింది.

కారు చిన్నగా ఊరుదాటి నడుస్తున్నది. అరుణ చెప్పింది, కరుణాకరానికి

మంచి గాలి కావాలన్నారట. ఊరి బయట మామిడి తోటలోని బంగాళాలో ఉంచింది. అక్కడ మంచి సముద్రపు గాలి, గంభీరమైన నిశ్శబ్దం, ప్రకృతి రామణీయకత ఉన్నాయట.

కారు బంగళాకు వచ్చేసింది. మేడ పై భాగంలో ఉన్న కరుణాకరం గదిలోనికి తీసుకు వెళ్ళి నన్ను పరిచయం చేసింది.

ఆయన మంచం మీద పరుపులో, దిండ్ల మధ్య ఎక్కడో కన్పించినట్లయింది. చిక్కి శల్యమై ఉన్నారు. ఆయనలో మిగిలి ఉన్న దేదో నాకర్థంకాలేదు. ఆయన ఏదో మాట్లాడడానికి ప్రయత్నించారు. కాని ఆ ప్రయత్నం విఫలమయింది.

"కృతజ్ఞుణ్ణి" అని మాత్రం వినిపించింది.

కరుణాకరాన్ని పరీక్షించాను. అక్కడే పెట్టి ఉన్న ఎక్స్‌రేలను చూచాను. కడుపులో కాన్సరు. ముదిరిపోయిన కేసు. లోపలికి ఏదో మందును అతి కష్టం మీద ఇవ్వగలిగాను ఆ పూటకు.

అరుణ, నాకై మేడ మీద ప్రత్యేకించిన గదిని చూపెట్టింది. నౌకరు నొకణ్ణి ఉంచింది నా కోసం. "రేపు తిరిగి వెళ్ళిపోవలసినవాణ్ణి, నాకీ ఏర్పాట్లన్నీ ఎందుకు?" అన్నాను.

"అదేమిటి మురారీ? వారికి పూర్తిగా నయం చేసి వెళ్ళాలి" అంది అరుణ ప్రాధేయపడుతూ.

ఏమని చెప్పను? కరుణాకరానికి నయమవుతుందని చెప్పనా? ఆపరేషన్ చేస్తే ప్రమాదం. కొన్నాళ్ళు మందులు వాడాలి. ఏమో, ఏమౌతుందో?

"ఏమిటి ఆలోచిస్తున్నావు మురారీ? నిరాశా నిస్పృహలను రేకెత్తించే మాటలు విని విని ఈ హృదయం అవిసిపోయింది. నీవైనా నాలో ఆశలు రేకెత్తించలేవా?" అరుణ కనుకొలకుల నుండి అశ్రుకణాలు రాలాయి.

"ఫరవాలేదు అరుణా" అన్నాను. ఈ పదం నా వృత్తి నేర్పిన పాఠమేమో?

అరుణ కనులలో కాంతులు మెరిశాయి. రాత్రి భోజనాలయ్యాక కరుణాకరం దగ్గర పది గంటల వరకు ఉండి, నా గదికి వచ్చేశాను. అరుణా వచ్చింది. కరుణాకరానికి తెప్పించవలసిన మందులను గురించి ప్రశ్నించింది. రాత్రికి

ఆలోచించాలన్నాను. నా మంచానికి దగ్గరగా ఉన్న పడక కుర్చీలో కూర్చుంది అరుణ. ఆరుణను ఈ పదిహేను సంవత్సరాల తన జీవితగాథను గురించి అడగాలనుకొన్నాను. ఎందుకో భయం వేసింది. అలా అడగడానికి నాకు హక్కు లేదన్నట్లు అనిపించింది.

కాని అరుణే నన్ను అడిగేసింది - "పిల్లలెంతమంది?" అని.

తలవంచుకొని యాపిల్ పండు కోస్తున్నవాడినల్లా త్రుళ్ళినట్లు తలెత్తాను. అరుణ ముంగురులు సముద్రంలోని అలల్లా ఎగిరి పడుతున్నాయి. ఆమె మోములోని ప్రశ్న అలాగే ఉండిపోయింది.

"లేరు" అన్నాను

"లేరా? రాజారావుగారి అమ్మాయితో నీ వివాహం జరగలేదా?"

అంతా చెప్పాను,

"అయ్యో!" అంది.

"భగవంతుడు మానవులు చేసిన పాపాలకు, ఒక్కోసారి ఈ జన్మలోనే ఫలితాన్ని అందిస్తాడనడానికి నా జీవితమే ఓ నిదర్శనం అరుణా" అన్నాను.

"ఏమిటో," దేనినీ మనం నిర్ణయించలేం. నీవు అనుకొన్నట్లు ఎందుకవ్వాలి? అంతా కర్మ. నన్ను వదలివేయి. వారలా ఎందుకవ్వాలి? మనసా, వాచా, ఒకరికి కీడు ఒనరించిన వ్యక్తి కారాయన. పరోపకార పారీణతే లక్ష్యంగా సాగిపోయింది వారి జీవితమంతా. అలాంటివారికి దుర్భరమైన ఈ వ్యాధి ఏమిటి?"

కరుణాకరం పట్ల అరుణ కెంతటి భక్తి!

"చాల రాత్రి గడిచిపోయింది. విశ్రాంతి తీసుకో. కాని ఒక్క మనవి. రెండు నెలలు సెలవు పెట్టి ఇక్కడే ఉండిపో. వారిని నాకు ప్రసాదించు" అంది అరుణ.

"ప్రయత్నిస్తాను" అన్నాను.

అరుణ వెళ్ళిపోయింది.

ఒకనాడు అరుణను ఆర్థిక స్థితి దృష్ట్యా త్యజించాను. ఈనాడు ఆ ఆర్థికతత్వం ఎంతటి విలువ లేనిదో మా ఇద్దరి ముందు! జీవితంలో కావలసినవి మరెన్నో ఉన్నాయని గ్రహించాను. శాంతిని ప్రసాదించేవి ప్రేమ, తృప్తి - ఇవే. కాని

ఆ రెంటికీ దూరమైన అభాగ్యుణ్ణి కరుణాకరం కేస్ చార్టు చూస్తూ ఉండిపోయాను కొంత సేపు.

ఏదో బలవత్తరమైన కోర్కె, ఆశ నన్ను విశాఖలో ఉండిపొమ్మని అంతర్గతంగా శాసిస్తున్నాయి. హృదయాన్ని ప్రశ్నించుకొన్నాను.

నేనెందుకుండాలి విశాఖలో? కరుణాకరం కోసమా? అరుణ కోసమా?

కరుణాకరం కోసం, అనవసరం. నమ్మకం లేదు. అతడు జీవించడం లాటరీ లాంటిది. మరి అరుణ కోసమా? ఎందుకు? ఏమో? కాదు. ఏదో! అర్థం కాలేదు.

నేనెటో కొట్టుకొని పోతున్నట్లు అనిపిచింది. ఫాన్ గాలి భరించలేక పోయాను. అపివేశాను. అదీ భరించలేకపోయాను. లైటు ఆర్పివేశాను, వెలుగును చూడలేక. ఆ చీకటినీ భరించగల ధైర్యం లేకపోయింది. వెలుగు, చీకటి - ఈరెంటిలోను బ్రతకలేని వాణ్ణి. రాత్రి ఒంటి గంట అయింది.

కరుణాకరానికి టెంపరేచరు ఎలా ఉందో చూస్తే? ఆ గదిలోనికి వెళ్ళాను. కరుణాకరం నిద్రిస్తున్నాడు. అతని కాళ్ళ దగ్గరగా క్రింద కూర్చొని తల మంచం మీద ఆన్చి నిద్రిస్తున్నది అరుణ.

వెనక్కు తిరిగి వచ్చేశాను. నా మనస్సు ఒక్కసారి కరుణాకరాన్ని గురించి ఆలోచించింది. అతని వయస్సు అరవై సంవత్సరాలపై మాట. ముప్పై సంవత్సరాల అరుణ అతని భార్య. ఎంతటి అదృష్టాన్ని అతను అనుభవించాడు!

అనుభవించాడా?

అనుమానాలు నీడల్లా నన్ను చుట్టు ముట్టాయి. కరుణాకరం సంసార సుఖాన్ని అనుభవించడం ఏమిటి? అరుణ అనుభవించింది. ఏమిటి? సంసార సుఖం లేకపోవడాన్ని.

'ఆయనను నాకు ప్రసాదించు' అన్న అరుణ మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. ఎందుకు? కరుణాకరం అరుణ విషయంలో నా స్థానాన్ని ఆక్రమించాడు. నాలో క్రీనీడల్లా ఏవో చెదురు మదురుగా చెడు భావాలు పొడచూపాయి. నన్ను కలవర పరిచాయి. విశాఖలో ఉండడమా, వెళ్ళడమా? కరుణాకరం బ్రతకడం గగన

కుసుమం లాంటిది. అరుణ కోసం ఎందుకు ఉండకూడదు?

ఆలోచలన భారంతో ఎప్పుడు నిద్రపోయానో, ఎప్పుడు తెల్లవారిందో? అరుణ తట్టి లేపడంతో త్రుళ్ళిపడి లేచాను.

"మురారీ! ఆయన వాంతి చేసుకొన్నారు. రక్తం పడింది" భయంగా అరుణ చెప్పింది.

కరుణాకరం ఉన్న గదిలోనికి వెళ్ళాను. కరుణాకరం వాంతి చేసుకోవటం మూలాన చాలా ఆయాసపడి ఉన్నాడు. ఎంతో నిర్జీవంగా ఉందా మోము.

"కొన్ని మందులు కావాలి."

"వ్రాసి ఇవ్వు; డ్రైవరు తెస్తాడు," అంది అరుణ.

"తొందర లేదు. ఆయన్ను విశ్రాంతి తీసుకోనివ్వు. నేనే వెళ్ళి కావలసిన మందులు తెస్తాను." అన్నాను.

కారులో టౌనుకు బయలుదేరాను. దారిలో డ్రైవరు కనకయ్య చెప్పాడు - కరుణ దొడ్డ ఇల్లాలట. కరుణాకరం కోసం మూడు సంవత్సరాలుగా తన యావచ్ఛక్తినీ ధారపోస్తున్నదట.

"మూడు సంవత్సరాలనేం, తన జీవితాన్నే ధారపోసింది" అనిపించింది. మరుక్షణంలో ఆ పాపం నాదే ననిపించింది.

కావలసిన మందులు కొన్నాను. డ్రైవరు అమ్మగారిచ్చారంటూ డబ్బు తీసిఇచ్చాడు. అక్కడే పోస్టాఫీసు నుంచి నా సెలవు ఒక నెల పొడిగిస్తూ గుంటూరు హాస్పిటల్‌కు జాబు వ్రాశాను. అరుణ రెండు నెలలు పెట్టమంది. కాని అనవసరం. కరుణాకరం నా రెండు నెలల సెలవును కోరగల జీవితాన్ని అనుభవిస్తాడని నాకు నమ్మకం లేదు.

తిరిగివచ్చి కరుణాకరానికి ఇన్‌జెక్షన్ ఇచ్చాను. సెలవు పెట్టినందుకు అరుణ సంతసించింది.

పన్నెండు గంటలయింది. వంట మనిషి వచ్చి భోజనానికి లెమ్మంది. వంట గదిలో అరుణ వడ్డన చేయించి, తానూ మరో కుర్చీలో పర్యవేక్షణకు కూర్చుంది.

"నీవు తినవా?" అన్నాను.

"నీవు కానివ్వు" అంది.

"కాదు, అరుణా, ఇద్దరం తిందాం" అన్నాను.

అరుణ శంకించింది.

"ఏం?" అన్నాను.

"వారింకా ఆ తాగే జావన్నా తాగలేదు" అంది.

నాకు క్షణ కాలం అసూయ కలిగింది - "కరుణాకరానికి ఈపూట ఏమీ ఆహారం ఇవ్వడానికి వీలులేదు. ఆ మందులలాంటివి" అన్నాను.

అరుణ మౌనంగా ఊరుకొంది. వంట మనిషికేసి చూచి అరుణకూ వడ్డించమన్నాను.

"పోనీ అతిథులు తిన్నాకైనా" అంది.

"నేను నీకు అతిథినేనా అరుణా? అంతకన్నా మరేమీ కానా?" అన్నాను.

అరుణ "అబ్బే... అది కాదు. పోనీ, నీవలా అనుకొంటే... సరే" అంది.

భోజనాలు పూర్తి అయ్యాక, "ఈ రోజు కడుపు నిండుగా భోజనం చేశాను" అన్నాను.

"సంతోషం" అని అరుణ కరుణాకరం గది కేసి వెళ్ళింది.

"అరుణా! ఆయనను లేపకు, విశ్రాంతి అవసరం" అన్నాను.

నా మాటలు విన్నదో లేదో అరుణ వెళ్ళిపోయింది. నా గదికి వచ్చేశాను.

వారం రోజులు గడిచిపోయాయి. కరుణాకరానికి మందు వాడుతూనే ఉన్నాను. అతని వ్యాధి స్థితిగతుల కన్నా, నా దృష్టి అరుణ పట్ల నిశితమయింది. అరుణకు ఒకనాడు నా చేజేతులా అన్యాయం చేశాను. నా మూలంగా ఆమె జీవితం ఈ కరుణాకరం పాలబడింది. అమె సంసార జీవితమే బుగ్గిపాలయింది. పోనీ, ఈనాడైనా అరుణకు నేనొనర్చిన అన్యాయానికి ఎందుకు ప్రాయశ్చిత్తం చేసుకోకూడదు? ఆ లత అలా వాడి నశించిపోవలసినదేనా? ఈ పదిహేను ఏళ్ళ జీవితంలోను అరుణ అనుభవించిందల్లా సేవ చేయడమే! ఆలోచించాను. కరుణాకరం జీవించడం దుర్లభం. ఆ తరువాత అరుణ ఏం కావాలి? అనాథ. ఎవరో వస్తారు, వారసుల మంటూ. ఒంటరి. పైగా స్త్రీ. చివరికి మిగిలేది అసంతృప్తి దుర్భర జీవితం. ఈ స్థితినుండి అరుణను నేనెందుకు రక్షించకూడదు?

అయినా కరుణాకరం బ్రతకడని ఏమిటి? ఏమో! ఇప్పటికే డాక్టరుగా పదిహేను సంవత్సరాల జీవన్మరణాల విలాస విన్యాసాలను తిలకించిన నేను కరుణాకరం జీవించగలడనిగాని, లేడనిగాని ఎలా నిర్ణయించగలను?

ఈగల్లా ముసురుకొన్నాయి ఆలోచనలు. మబ్బులా ఏదో స్వార్థం!

అరుణ వచ్చింది నవ్వు ముఖంతో. ఏదో అంది. అది వినడం మీద నా మనస్సు లగ్నం కాలేదు. అరుణ ధరించిన తెల్లచీర, ఆ నల్లని కేశాలు, నుదుట తిలకం, చెవులనున్న రింగులు... చూస్తూ ఉండిపోయాను. అరుణకు ముప్పయి సంవత్సరాల ఉన్నట్లు లేదు. నా శరీరం ఉప్పొంగింది. నా వృత్తి రీత్యా నేనెంతమంది స్త్రీలను ఎంత దగ్గరగా ఉండి చూడలేదు? కాని, ఏమిటో....

"ఏమిటలా చూస్తున్నావు?" అంది.

"అబ్బే! మరేం లేదు. ఆలోచిస్తున్నాను."

"దేనిని గురించి?"

"నిన్ను గురించే?"

"నన్ను గురించా? నన్ను గురించి ఆలోచించే వాళ్ళు ఉన్నారా, మురారీ?" అంది.

"ఎందుకు లేరు? నేను...."

"నన్ను గురించి ఆలోచిస్తున్నావా?" అంది.

త్రుళ్ళిపడ్డాను.

"పోనీండి, ధన్యురాల్ని. ఇంతకూ నేను చెప్ప వచ్చింది, ఆయనకు కొంచెం మెరుగ్గా ఉందని. ఈపూట పళ్ళ రసం తాగడానికి లేచి కూర్చొనగలిగారు. ఆయాసం అంతగా లేదు. మిమ్మల్ని ఎంతగా మెచ్చుకొన్నారో!"

"కరుణాకరానికి మెరుగ్గా ఉంది" అనే భావం నాలో అంతగా సంతోషాన్ని కలిగించలేకపోయింది.

"ఈపూట మనమంతా ఆయన గదిలోనే భోజనం చేదాం. ఆయనా సంతోషిస్తారు, నలుగురిలోకి తానూ వస్తున్నట్లు" అంది అరుణ.

"అరుణా, కరుణాకరానికి మెరుగ్గా ఉంది అనుకోకు. అది రోగ లక్షణం. అయినా, రోగికి విశ్రాంతి అవసరం" అన్నాను.

అలా అని నేనెంత బలహీనతకు జారిపోయానో? అరుణ నశించిన కుతూహలంతో వెళ్ళిపోయిందక్కడనుండి.

ఆ సాయంత్రం అయిదు గంటలకు బయలుదేరి మందుల కోసం టౌనుకు వెళ్ళవలసి వచ్చింది. అరుణను రమ్మన్నాను. బయలుదేరింది. దారిలో పిచ్చాపాటీ మాట్లాడడం ప్రారంభించింది. తన ప్రసంగాన్ని కరుణాకరం వ్యాధికై తాను తరిగిన ప్రదేశాలు, అక్కడి పరిస్థితులు, ఆ డాక్టర్లు, ఇలా ఇలా కొనసాగించింది, వింటూ కూర్చున్నాను.

"అంతా విచిత్రంగా ఉంటుంది. ఈ ప్రపంచంలో సుఖ దుఃఖాలు ద్వంద్వాలనే అనుకొంటారు. చీకటి వెలుగుల్లా జీవితంలో అవి కలుగుతూ ఉంటాయను కొంటాము. కాని ఏమిటో, నా జీవితం అంతా ఇలా బరువుగానే సాగుతున్నది."

అరుణ మోముకేసి చూచాను. ఆ మోములో మబ్బుతునకల్లా విచార రేఖలు గోచరించాయి. కరుణాకరాన్ని తానూ, నౌకర్లు... అంతా ప్రేమించే వారేనట!

"మా లక్ష్యం, ధన్యత, జీవితం ధ్యాస అంతా వారు జీవించడం అనే ఆశలోనే ఉన్నాయి" అంది.

కావలసిన మందులు కొన్నాను. సాయంత్రం ఆరు గంటలయింది. వెంటనే తిరిగి వెళ్ళడం నా కిష్టం లేదు. సినిమాకు వెళదామన్నాను.

అరుణ సినిమాలనేవి ఉన్నట్లే మరిచిపోయిందిలా ఉంది. "సినిమానా?" అంది.

"నీవు వెళ్ళు. నేను బంగళాకు వెళ్ళి కారు తిప్పి పంపుతాను."

"అలాకాదు. నీవూ వస్తేనే" అన్నాను.

అరుణ మౌనం వహించింది. "కాదు, మురారీ. వారు ఒంటరిగా ఉంటారు."

"కరుణాకరం నిద్ర లేవరు. ఆయనకు వాడిన మందలాంటిది" అని హామీ ఇచ్చాను. అరుణ అదోలా చూచింది.

"పోనీ, అయితే బంగళాకే వెళదాం" అన్నాను.

"మురారీ! నీకూ విశ్రాంతిని దూరం చేయడం న్యాయం కాదు నాకు. పద, సినిమాకే వెళదాం" అంది.

హాల్లోకి వెళ్ళాము. నా మనసంతా అరుణ బాహ్య సౌందర్యం పట్ల

లగ్నమయింది. మల్లెపూవులాంటి తెల్లని చీర ధరించింది. కొంగు మెడ చుట్టూ చుట్టుకొంది. లేత పసుపు రంగు జాకెట్టు తన ఛాయను తెలియపరుస్తోంది. నశించిపోని యవ్వనం తొంగి చూస్తున్నది అరుణ నుంచి.

సినిమా చూడలేక పోతున్నది అరుణ. నేనూ అంతే! సినిమా సగం కాకముందే అరుణ ఏదో నిశ్చయించుకొన్నట్లు లేచి, "వెళదాం" అంది.

ఇష్టం లేకున్నా "సరే" అన్నాను.

కారును, అనాథ శరణాలయంట; అక్కడకు త్రిప్పించింది. ఎందుకన్నాను. ఆ శరణాలయం, కరుణాకరం నెలకొల్పిందట. అనాథ శిశువులను, బాల బాలికలను పోషించి, వారికి ఏవో వృత్తులను నేర్పించడం, అవీ చేస్తారట అక్కడ. ఆ శరణాలయం అంటే కరుణాకరానికి ప్రాణం. ఈ మధ్య ఆయన ఆరోగ్యం బాగులేకపోవడంతో మరెవ్వరినో దాని వ్యవహారాలను చూడడానికి నియమించడం జరిగింది.

మా కారు శరణాలయానికి వెళ్ళగానే అక్కడ అనాథ బాల బాలికలు, సిబ్బంది, అంతా మమ్ములను చుట్టుముట్టారు. అరుణను ఎంతో గౌరవించారు. అరుణ అక్కడివారినందరినీ పేరు పేరునా పిలిచి, కుశల ప్రశ్నలు వేసింది. పిల్లలకు బిస్కట్లు పంచింది. అరుణ కనుకొలకులు స్రవించాయి, శరణాలయం నుండి బయటకు వస్తున్నప్పుడు.

తిరుగు ప్రయాణం మొదలయ్యేసరికి పెద్ద పెట్టున వర్షం, గాలి ప్రారంభమయ్యాయి. డ్రైవరు గాజు తలుపులు మూసివేసి చిన్నగా డ్రైవ్ చేయ్యడం ప్రారంభించాడు. ఈదురు గాలి వేస్తున్నది. నేను అరుణ దగ్గరగా జరిగాను. అరుణ ఈ ప్రపంచంలో లేనట్టు ఏదో ఆలోచిస్తున్నది.

"అరుణా!" అన్నాను. పలుకలేదు. "అరుణా!" అంటూ పెద్దగా పిలిచాను.

తుళ్ళిపడినట్లు "ఏమిటి మురారీ?" అంది.

"ఏదో ఆలోచిస్తున్నావు?"

అరుణ పొడిగా నవ్వింది. "లేదు. ఏదో పరధ్యాన్నంగా ఉన్నాను" అంది.

"అదే నేననేది" అన్నాను.

అరుణ నాకేసి చూసింది. ఆ చీకటిలో కూడా ఆమె నేత్రాలలో కాంతి

కన్పించింది, కప్పుకొంటున్న తెరలతో,

"ఏదో ఆలోచన. ఈ జీవితంలో ఎన్ని సమస్యలను గురించి, ఎన్ని పర్యాయాలు ఆలోచించలేదు! కాబట్టి నా వయస్సునంతా ఆలోచనలే ఆక్రమించి మింగేశాయి" నిర్వేదం వినిపించింది అరుణ మాటలలో.

బంగళా వచ్చేసింది. కరుణాకరం నిద్రపోతూనే ఉన్నారట. నేనిచ్చిన నిద్ర మాత్రలు ఆ మాత్రం పనిచేస్తాయని నాకు తెలుసు.

భోజనాలయ్యేసరికి రాత్రి పది గంటలయ్యింది. భోజనాల గదికి వస్తూనే కరుణాకరానికి మందులు ఎలా ఎలా వాడవలసినది చెపుతాను, రమ్మన్నాను అరుణను. గదికి వచ్చాక ఫాన్ ముందు కూర్చొని నా భవిష్యత్కార్యక్రమాన్ని ఆలోచించాను. అరుణలోని అసంతృప్తి నానాటికి పొంగి పొర్లుతున్నది. కరుణాకరానికి నయమవుతున్నట్లు కన్పించినా, నమ్మకం లేదు. దేహాన్ని చాలిస్తాడు. ఆమెను నా వెంట తీసుకొని వెళ్ళాలి. ఆమె కోరితే భార్యగా స్వీకరించాలి. ఇది సంక్షిప్తంగా నా ఆలోచనల పర్యవసానం.

గంట గడిచి పోయింది. అరుణ పాల గ్లాసుతో వచ్చింది. ఆమె రూపే మారిపోయింది. నెత్తి నిండుగా ముసుగుతో వచ్చింది.

"ఏం అలా వున్నావు?" అన్నాను కూర్చొనడానికి కుర్చీ చూపిస్తూ.

"ఎలా ఉన్నాను?" అంది.

"మూర్తీభవించిన-" ఏదోపెద్దమాట అనాలని ప్రయత్నించాను కాని విఫలుడ నయ్యాను.

"మూర్తీభవించిన నిర్భాగ్యురాలుగానా?" అంది పొడిగా నవ్వి.

"నీవెలా నిర్భాగ్యురాలివి అవుతావు అరుణా?" అన్నాను.

అరుణ అదోలా తీక్షణంగా అయిపోయింది. అనంతంలోకి చూచినట్లు చూచి నిట్టూర్చింది.

"అసలు భాగ్యమంటే ఏమిటి?" అంది.

నిరుత్తరుణ్ణి అయ్యాను.

అరుణే అంది, "మనకున్న సిరి సంపదలు, అంతస్తులు, హోదాలు భాగ్యం ఎలా అవుతాయి? జీవితంలో తృప్తి, నిలకడ - ఇవి కావాలి. అవి దూరమైననాడు

అన్నీ ఉండీ లేనట్లే."

"నీకేం అసంతృప్తి ఉంది, అరుణా?" అన్నాను.

అరుణ తలెత్తి చూచింది. "లేదు, అవును" అంది గొణుక్కున్నట్లు, "నా ఈ జీవితం ఎవరికి, ఎందుకు ఉపకరించింది? ఏనాడో కుదురు చెడిన ఈ బ్రతుకు ఆనాడే అంతరించినా బాగుండేదేమో!"

అరుణ కనుల నుంచి ధారావాహికంగా అశ్రుకణాలు రాలిపోయాయి.

నేను నిర్విణ్ణుణ్ణయిపోయాను.

"మురారీ! నా ఒక్క కోర్కె తీర్చగలవా?" అంది అరుణ.

తెల్లబోయాను. "ఏమిటి?" అన్నాను.

"నా గురించిన బాధ్యత నీ నెత్తిన పెట్టతలచుకొన్నాను. మోయగలవా?

"ఏమిటది?" ప్రశ్నించాను.

అరుణ నాకేసి చూచింది. ఆమె నేత్రాలలోని పాప కన్పించడం మానివేసింది అంతా అశ్రుమయమయింది.

"నాకు విశ్వాసం ఉంది నీ మీద. నశించలేదు. నశించదు" అంటూ లేచి వెళ్ళిపోయింది.

నాకంతా అయోమయమయింది. అరుణ మెరుపులా వచ్చి వర్షించి వెళ్ళిపోయినట్లు తోచింది. దిగ్భ్రమ చెందాను. నేను వహించవలసిన బాధ్యతేమిటో అర్థం కాలేదు. మధ్య మధ్య నా ఆలోచనలు అడ్డు తగులుతున్నాయి అరుణను గురించి.

ఎప్పుడు నిద్ర పట్టిందో!

★ ★ ★

మరునాడు తెల్లవారుతుండగా, పనిమనిషి ముత్తమ్మ వచ్చి లేపి, "అరుణమ్మగారు పోయారు బాబో!" అని గొల్లుమన్న క్షణాన నాలోని భావాలు, చిత్త స్థితి, రక్తం, చీకటి, వెలుగు, వేగం, ధ్వని, ఆశ అన్నీ క్షణ కాలం నీరసించి, స్తబ్దత పొంది, ఆవిరి అయిపోయినట్లు అనిపించింది.

నా దృష్టి అంతా నీలిమగా మారి నశించినట్లు, మెదడు పని మానివేసినట్లు

తోచింది. అచేతనంగా ఎప్పుడు చేరానో మేడ క్రింది భాగంలో అరుణ ఉన్న గదిలోనికి. చుట్టూ బంగళాలోని వారంతా మూగి ఉన్నారు. విచారాంబుధితో మూర్తీభవించి ఘనీభవించిందా గది. అరుణ తెల్లటి చీరలో ఒదిగి గాఢ నిద్రలో మునిగి ఉన్నట్లు ఉంది. అంతా ముగిసి పోయింది. అరుణ జీవితం తెల్లవారి పోయింది.

★ ★ ★

విశాఖకు నేనెందుకు వచ్చానో, చివరికి నేనెందుకు ఉపయోగింప బడ్డానో ఆలోచిస్తే సామ్యం లేదు. అరుణ భౌతిక దేహం పంచ భూతాలలో కలిసిపోయి పదమూడు రోజులయింది. అరుణకు ఇహాన్ని ప్రసాదించలేని నేను, కరుణాకరం పంపున పరాన్ని పొందమంటూ కర్మచేశాను. ఈనాటితో అది ముగిసి పోయింది. మిగిలి ఉంది అరుణ మిగిల్చిన జ్ఞాపకాలు, ఆమె ఏర్పరచిన బాధ్యతలు.

చాల పొద్దు పోయింది. బయట చిమ్మ చీకటి. అరుణ దాటిపోయిన నాటి నుండి జరిగిన సంఘటనలను సమీక్షించు కొనకుండా ఉండలేకపోయాను.

అరుణ మరణించిన నాటికి కరుణాకరం స్థితి చాల విచిత్రంగా ఉండి పోయింది. ఆయన ఈ వార్త వింటూనే అక్కడికి వచ్చాడు. ఒకటి రెండు అశ్రుకణాలు రాల్చాడు. నాకు ఆశ్చర్యం వేసింది, ఒకరిద్దరి సాయం లేనిది నడువలేని కరుణాకరం అక్కడికి ఎలా వచ్చాడా అని. ఆయనను ఎవరో పట్టుకొనడానికి ప్రయత్నించారు. వారిని వారించాడు. ఆయన హృదయంలో ఎన్ని అగ్ని పర్వతాలు రగులుతున్నాయో, ఎన్ని సుడిగుండాలు నిలిచిపోయాయో! పైకి గంభీరంగా ఉండిపోయాడు. నేనాయన దగ్గరగా వెళ్ళి మౌనంగా ఆయనకేసి చూచాను.

"మురారీ! విధి నన్నిలా అన్యాయం చేస్తుందని అనుకోలేదు." అన్నాడాయన.

మధ్యాహ్నం మూడు గంటల కల్లా అనాథ శరణాలయం నుంచి అంతా వచ్చారు. కారులో అరుణ దేహాన్ని ఉంచాము. అక్కడికి కొద్ది దూరంలో ఉన్న మామిడి తోటలో చితికి ఏర్పాట్లు జరిగాయి. కరుణాకరం తానేవచ్చి అగ్ని సంస్కారం చేస్తానన్నాడు.

ఆ స్థితిలో ఆయన అలాంటి పని చేయగలడని నేనూహించనైనా లేదు. కాని, వాదించగల ధైర్యం, దాక్షిణ్యాలోభత్వం నాకు లేకపోయాయి.

అరుణ మృతదేహానికి అగ్ని అంటించి అలాగే కూలిపోయాడు కరుణాకరం. ఆ అగ్ని పర్వతం అప్పటికి బద్దలయింది.

నాటి సాయంత్రం, అరుణ గదిలోని ఖాళీ స్లీపింగ్ పిల్స్ సీసా, నాలో ఆలోచనలను రేపింది.

అరుణది ఆత్మహత్య! ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. అరుణ నాపై మోపదలచిన బాధ్యతేమిటో అవగాహన కాలేదు.

నేను విశాఖ వచ్చింది కరుణాకరానికి చికిత్స చేయడానికి. కరుణాకరానికీ నాకూ మధ్య వంతెన లాంటిది అరుణ. ఆ వ్యక్తి దాటిపోయింది. ఆ వంతెన కూలిపోయింది.

ఒక విధంగా అరుణ అనే ఆకర్షణ మూలంగా నేను విశాఖలో ఉన్నాను. ఈ దుర్ఘటన తరువాత అక్కడి నా ఉనికి అసహ్యమనిపిచింది.

జీవితంలో ఓటమి, కనువిప్పు, పరివర్తన లాంటివి నా చుట్టూ పరిభ్రమించాయి. లీలా మాత్రంగా నాపై నాకే అసహ్యం, ద్వేషం ధ్వనించాయి.

అరుణ గతించిన రెండవనాడు విశాఖ నుండి గుంటూరు ప్రయాణమై కరుణాకరానికి చెప్పడానికి వెళ్లాను. కరుణాకరం ఒంటరిగా గదిలో, అరుణ ఫోటోకేసి చూస్తూ కూర్చొని ఉన్నాడు.

"కరుణాకరం గారూ! నేను గుంటూరు వెళ్తున్నాను. ఇక్కడ ఉండలేక పోతున్నాను, మీస్థితి, నేను ఊహించలేనిదాని కన్నా చాల మెరుగ్గా ఉంది. ఏ డాక్టరైనా ఆపరేషన్ చేసి మిమ్మల్ని కాపాడగలడు. త్వరగా ప్రయత్నించండి. మరి నాకు సెలవు" అన్నాను.

"మురారీ! కృతజ్ఞుణ్ణి. నాకెలాంటి మందులూ అవసరం లేదింక. బహుశా అదే నయమవుతుంది" అన్నాడాయన.

ఆశ్చర్యంగా ఆయనకేసి చూచాను.

"అవును, మురారీ! కొందరి జీవితాలు వ్యధలకై సృష్టించబడతాయి. అరుణ

జీవితాంతం వ్యధిత. ఆమెకు విశ్రాంతిని నశింపజేయడానికి నేను సృష్టింపబడ్డాను. ఆమె దాటిపోయింది. ఇక నాకు నయమవుతుంది."

"సెలవు ఇప్పించండి" అన్నాను లేస్తూ.

"మంచిది, మరిచాను. అరుణ తన అంతిమ ఘడియాల్లో అనుకొంటాను మీకో జాబు ఉంచి పోయింది తన గదిలో" అంటూ ఆ ఫోటో వెనకాలనుంచి ఒక జాబు తీసి ఇచ్చాడు. ఆ జాబు తీసికొని వచ్చి గదిలో కూర్చొని విప్పాను.

"మురారీ!

నా ఈ మరణం నిన్ను ఆశ్చర్య పరచవచ్చు. బాధ పెట్టవచ్చు. కాని, ఇంతకన్నా మార్గాంతరం లేకపోయింది. నీకు తెలియని నా జీవిత గాధనంతా వింటే, ఇంతకంటే మరో మార్గం ఉందనుకోవు.

కలిసిరాని అదృష్టం, నన్నాడు నీనుండి దూరం చేసింది. మూసుకొన్న ఆ జీవిత మార్గం నుంచి వెనుదిరిగి ఏకాకినై విశాల ప్రపంచలోనికి బయలుదేరాను. జీవిక గడవాలిగా? కరుణాకరంగారి శరణాలయానికి కావలసిన ఉద్యోగుల విషయం పేపర్లో చూచి, దరఖాస్తుతో వారిని చూచాను. ఆ దయామయుడు వెంటనే ఉద్యోగం ఇచ్చి, శరణాలయంలోనే వసతి ఏర్పరచారు.

శరణాలయపు అధినేత కరుణాకరం అయినా, ఆ వ్యవహారాలు చూడడానికి వారి తమ్ముడు వీరభద్రం ఉండేవాడు. వీరభద్రం యువకుడు. యూనివర్సిటీ నుంచి వచ్చాడు. ఉద్యోగరీత్యా అతనితో నాకు పరిచయం అధికమయింది.

కుదురుతప్పిన జీవితాలు కూలిపోవాల్సిందేనేమో! అలాగే అయింది నా గతి. ఆయన నన్ను వివాహమాడతానన్నాడు. ఆదర్శంగా శరణాలయాన్ని నడుపుతూ, జీవితాలను సేవకు అంకితం చేదామన్నాడు.

తెంచివేసుకున్న ఆశ చిగిర్చింది. లౌకిక ప్రతిపత్తికి దూరం కావడం విజ్ఞతకు ఘాతమని పించింది. భావ సమన్వయం సాధించడంతో రాజీపడ్డాను. ఇష్ట పడ్డాను.

కాని, నేనొక అగాధంలోకి జారిపోతున్నట్లు గమనింపలేకపోయాను. నా పాలిట బలహీనమైన క్షణం దొర్లిననాడు, నా స్త్రీత్వాన్ని వీరభద్రం అనుభవించాడు. ఫలితం, ప్రకృతినాపై ముద్రవేసింది. ఆ తరువాత కొన్నాళ్లకు వీరభద్రం

అదృశ్యమయ్యాడు. వీరభద్రం అదృశ్యం కావడంతో నేనెలాంటి స్థితిలో ఉన్నానో అర్థమయింది. శిథిల జీవితాన్ని పైకి లేపాలనే ఆశలో నేనెంత దగా పడ్డానో అర్థమయింది.

శరణాలయం చూడడానికి వచ్చిన కరుణాకరం గారితో నా దీన స్థితి చెప్పు కున్నాను. ఆయన ఖిన్నులయ్యారు. నాకూ, బొంబాయిలో ఉన్న వీరభద్రానికీ తప్పక వివాహం జరిపిస్తానని మాటన్నిచ్చి వెళ్లారు.

ఈ రహస్యం రహస్యంగానే ఉండిపోయింది. వారం రోజుల తరువాత కరుణాకరంగారు శరణాలయానికి వచ్చి, ఏకాంతంగా నన్ను కలుసుకొని, 'అరుణా, వాడు దుర్మార్గుడు. నా శాయశక్తులా ప్రయత్నించాను. ససేమిరా అన్నాడు. అయినా ఈ అన్యాయం ఇలా కొనసాగడానికి వీలులేదు. నన్నేం చేయమంటావు చెప్పు' అన్నారు.

నేను కన్నీరు మున్నీరు అయ్యాను. ఆ కరుణానిధి కరిగిపోయారు. వారిలో కరుణాస్రవంతి వెల్లువలైంది.

దాని పర్యవసానమే...... ముప్పయి సంవత్సరాల క్రిందట యుక్త వయస్సులో భార్య పోగా, కఠోర బ్రహ్మచర్య నిష్ఠలో మునిగి తన సర్వస్వాన్ని ప్రజా జీవితానికై అర్పితం చేసుకొన్న కరుణాకరంగారికి భార్య నయ్యాను లోకం కోసం.

వృద్ధాప్యంలో వివాహం చేసుకున్నాడనే మచ్చకు లోనయింది వారి నిష్కళంక జీవితం - నా కోసం. నాకై వారు త్యాగం చేశారు.

వివాహమైన మరుసటి రోజునే ఊటీ వెళ్ళి పోయాం విశ్రాంతికని చెప్పి. అక్కడ ఎనిమిది నెలలపాటు ఉండి పాపతో తిరిగి వచ్చేశాము. ఆ పాప ఊటీలో దొరికిన అనాథ అని శరణాలయంలో చేర్చాం.

వారి కీర్తి ప్రతిష్ఠల మాటున, నా పాప కార్యం మాసిపోయింది. ఆ పాపను దగ్గర ఉంచుకొని పెంచి, పెద్దచేయగల ధైర్యం నాకు లేకపోయింది. సంఘం అనుమానిస్తే సమాధాన పరచగల స్తోమతు లేక అలా చేయవలసి వచ్చింది. పాపను అనాథ శరణాలయంలో ప్రవేశ పెట్టిన నాడు, నాకన్నా వారెంతో కుమిలిపోయారు. దొరగా పుట్టి పెరిగినా దొంగ అయ్యారాయన.

ఆనాటి నుండి ఈ దుర్భర దౌర్భాగ్య జీవితం అలాగే సాగిపోయింది. పాప అనే మమత, కళంకమనే భయం - వీటి మధ్య ఈ జీవితం కాగిపోయింది. కొన్నాళ్ళకు వారికి జబ్బు చేయడం, ఆ తరువాతంతా నీకు తెలిసిందే.

కాని, మురారీ, ఈ హీనస్థితిలో నైనా ఈ జీవితం సాగిపోవడం విధికి ఇష్టం లేకపోయింది. నిన్నటి సాయంత్రం, మనం టౌన్‌కి వెళ్ళగానే వీరభద్రం పది సంవత్సరాలకుగాను తిరిగి వచ్చాడట. అప్పుడు వారు నిద్రిస్తున్నారట. నా గురించి వాకబు చేసి టౌన్‌కి వెళ్ళాడట.

నాకు తెలుసు, వీరభద్రం దుర్మార్గుడు. ఏదో గొడవ చేస్తాడు. దాని వలన సంధ్యలో ఉన్నవారికి అశాంతి. పాప జీవిత రహస్యం బయట పడుతుంది. దాని జీవితం బుగ్గిపాలవుతుంది. చాల ఆలోచించి, ఈ నిర్ణయానికి వచ్చాను. నేను తొలగిపోతే సమస్యే లేదు. వీరభద్రం తిరిగి వెళ్ళిపోతాడు. బహుశా ఆస్తి కోసం పెనగులాడవచ్చు. వారి అన్నగారు నిర్వికారులు. వీరభద్రం కోరిన దానిని ఇచ్చి వేస్తారు.

నేను, రెండు జీవితాలను కళంకితం చేయడం ఇష్టం లేక తొలగిపోతున్నాను. కాని, వారిని గురించే ఆలోచించాను. నా దృష్టి నీ వైపు మళ్ళింది. పాపకు, వారికి నీవే రక్ష. వారి బాధ్యత స్వీకరించమని నిన్ను వేడుకొంటున్నాను.

పది సంవత్సరాల వయసన్నా సరిగా లేని పాప, అరవై సంవత్సరాల జీవితాన్ని గడిపిన వారు ఇద్దరూ ఒకరి సాయం కావలసినవారే! వారినెలా కాపాడగలవో! ఏ గాలి తాకిడీ తగలకుండా ఆ నిర్మల జ్యోతులను కాపాడగలవని నమ్ముతున్నాను.

మురారీ! నీకు బాధ్యతలను ఒప్పగించి, నేను వాటి నుంచి పారిపోతున్నాను. అభాగ్యురాలిని, నన్ను క్షమించు.

అరుణ."

జాబు పూర్తి చేసేపాటికి నాలోని సకల భావాలు స్థంభించాయి. నేనెంతటి మూర్తి పట్ల ఎంత జ్ఞాన లవలేశంగా వ్యవహరించానో, నేనెంత పతితుణ్ణి అయి

ఓడిపోయానో అర్థమయింది. నాలోని అనేక భావాలు వీచికల్లా లేచి పోయాయి. నా మానసిక స్థితే మారిపోయింది. క్షణంలో వృద్ధుణ్ని అయిపోయాను. నా కనుల ముందు అరుణ ప్రత్యక్షమయింది. వెంటనే కిందికి దిగి నాకై ఎదురు చూస్తున్న కారెక్కి డ్రైవరును సముద్రపు ఒడ్డుకు తీసికొని పొమ్మన్నాను.

ఉత్తుంగ తరంగభరితమై ప్రళయ ఘోష పెడుతున్న ఆ సముద్రం కేసి చూచాను. అరుణ జ్ఞాపకానికి వచ్చింది. ఆమె జీవితం ఇలాగే గంభీరమై, ఇలాగే ఘోషతో గడిచిపోయింది.

అరుణను గురించి ఆలోచించాను. అరుణ జీవితంలో ఎంత భాగం చీకటిలో అణగారి పోయిందో! ఆమె బ్రతుకు బాట మీదుగా కర్కశంగా నేనే కాదు, నాతో పాటు వీరభద్రం, విధి, ఆరముగ్గని అదృష్టం ఎందరో నడిచి పోయారు.

ఆమె చితికి పోయింది. అరుణ అప్పగించిన బాధ్యత నేను స్వీకరించటం నా కనీస ధర్మమనిపించింది. నా పాపాల నుండి నన్ను కాపాడుకోవటానికి, నాల్లోని కల్మషాన్ని కడుక్కొని మానసిక శాంతిని పొందడానికి పాపను చూడడం తక్షణ కర్తవ్యమనిపించింది. బంగళాకు తిరిగి వచ్చి కరుణాకరం దగ్గరకు వెళ్ళాను. ఆయన ఏదో తపస్సు చేస్తున్నట్లు అర కన్నులతో కన్పించారు.

"కరుణాకరం గారూ!" అన్నాను.

ఆయన నాకేసి చూడనైనా చూడలేదు. "రైలు తప్పిపోయిందా?" అన్నారు.

"లేదు. ప్రయాణం మానుకొన్నాను" అన్నాను.

ఆయన ఆశ్చర్యంగా చూచారు.

"అరుణ నాకు మిమ్మల్ని, పాపను అప్పగించింది" అన్నాను.

ఆయన మరీ ఆశ్చర్యపోయారు.

"చూచారా! నేనూ, అదే; పాపను గురించే ఆలోచిస్తున్నాను. నా సమస్యను అరుణ తీర్చి వేసింది. అవును! మీరే తగినవారు. ఎలా నిర్వహిస్తారో ఆ బాధ్యతను. ఇకపోతే, నా బాధ్యత అంటారా? అరుణ తప్ప మరెవ్వరూ మోయతగింది కాదు.

ఆమె పోయింది. ఇక ఆ జగన్నాథుడే" అంటూ ఏదో గొణిగారు.

"నన్ను ఏం చేయమంటారు?" అన్నాను.

"పాప పట్ల అరుణ చేయమన్నట్లు చేయండి. మీకు కావలసిన ఆర్థిక బలాన్ని నా నుంచి తీసికొండి. నన్ను బాధ్యతల నుండి విముక్తుణ్ణి చేయండి" అన్నారాయన.

ఆయనను అంతకన్నా ఎక్కువగా మాట్లాడించి మానసికంగా బాధ పెట్టడం ఇష్టం లేకపోయింది. వచ్చేశాను. ఈ పదమూడు రోజులూ అరుణ కర్మ ముగించాము. మిగిలిందల్లా పాప బాధ్యత.

★ ★ ★

నా కర్తవ్య నిర్వహణకు పాప నా వెంట రాకపోవటం అనే ఒక ఆటంకం ఏర్పడ వచ్చునని భయపడ్డాను. కాని ఈ విషయంలో భగవంతుని దయ, అరుణ సంకల్ప బలం నాకు ఉపకరించాయి. నేనూ, కరుణాకరంగారూ శరణాలయానికి వెళ్ళి పాపను తీసుకొని వచ్చాము.

పాప అచ్చు అరుణ పోలికే!

కరుణాకరం, "పాపా! అరుగో, బాబాయి. ఆయన వెంట వెళ్ళి చక్కగా చదువుకొంటావా తల్లీ?" అన్నప్పుడే 'సరే' అని తల ఊపింది. నా జన్మ ధన్యత పొందినట్లు భావించాను. పాపతో బంగళాకు వచ్చాం. ఆ రాత్రికే ప్రయాణం నిర్ణయించాము. కరుణాకరం గారిని కూడ తీసికొని వెళ్ళాలని చివరిసారిగా ప్రయత్నించాను.

హస్తాలు ముకుళించి, "నన్ను క్షమించు, మురారీ! భగవన్నిర్ణయానికి నన్ను వదలివెయ్యి. నాకు కొంత మనశ్శాంతి అన్నా దొరుకుతుంది" అన్నారు.

నేను చేయగలిగిందేముంది? ఆ జీవితాన్ని అలా విధికే వదలివేశాను.

బంగళా నుంచి పాప కోసం ఏవేవో తీసికొని వెళ్ళమని కరుణాకరం ఇచ్చారు. వాటిలో పాప కోసం సొమ్ములు, బట్టలు, ఇంకా ఇలాంటివెన్నో ఉన్నాయి. వాటి నన్నింటిని అక్కడే వదిలివేసి అరుణ ఫొటో ఒక్కటిమాత్రం తీసుకొన్నాను.

సాయంత్రం కారులో రైలు స్టేషన్‌కు బయలుదేరి వెళ్ళాము. కరుణాకరం కూడా వచ్చారు. బండి రెండు గంటలు ఆలస్యమన్నారు. వెయిటింగు రూములో కూర్చొన్నాము. ఊహించని సంఘటన జరిగింది.

కారు డ్రైవరు వచ్చి ప్లాట్ ఫారం మీద వీరభద్రం ఉన్నాడనీ, నాతో మాట్లాడాలని అంటున్నాడని చెప్పాడు. కరుణాకరం ఆవేశ పడ్డారు. నేను వీరభద్రం దగ్గరికి వెళ్ళాను. వీరభద్రం తానంతా మారిపోయానన్నాడు. తాను తెలిసీ తెలియని స్థితిలో చేసిన పాపాలకు పశ్చాత్తాపం కలిగి అరుణను క్షమించమని వేడుకుందామని వచ్చాడట. ఇలాంటి దుర్ఘటన జరుగుతుందని ఊహించనైనా లేదట.

వీరభద్రం కనుల నుంచి అశ్రుకణాలు రాలాయి. అతని పట్ల నాలో పెరిగిన ద్వేషం హరించి పోయింది.

"అయ్యా! నాకు మంచి మార్గం అంటూ ఒకటి దొరుకుతుందా, ఈ జన్మకు?" అన్నాడు.

పాపం అనిపించింది. నేను అరుణ జాబును గురించి, అరుణ నాకు అప్పగించిన బాధ్యతలను గురించి చెప్పాను.

"మురారిగారూ! పాపను నాకు ఇవ్వండి. ఆ పాపను చూచుకొంటూనైనా జీవితాన్ని ప్రశాంతంగా గడపగలనేమో!" అన్నాడు వీరభద్రం.

ఆలోచించాను. ఇక్కడా నా స్వార్థం అడ్డు వచ్చింది. పాపను సాకి నా జీవితాన్ని పునీతం చేసికోవాలి. అయినా పాపను దానం చేయడానికి నాకున్న హక్కేమిటి? పాప తల్లి అరుణ, నాకు అప్పగించింది పాపను. తండ్రి కరుణాకరం అంగీకరించాడు. కాని, వీరభద్రానికి పాప మీద ఎలాంటి హక్కు లేదా?- అనే శంక పీడించింది. ఏమిటో! ఇవన్నీ భవబంధాలు, పూర్వజన్మ కృత బంధాలు. ఋణానుబంధాలు.

'వీలులే'దన్నాను.

వీరభద్రం, "మురారిగారూ!" అంటూ నిర్వేదభరితమైన హృదయాన్ని ముద్ద చేసి నా ముందుంచి దీనంగా చూచాడు. చేజేతులా తన రక్తాన్ని ఒలక పోసికొని

చింతిస్తున్న ఆ అభాగ్యుడి పట్ల జాలి వేసింది. కాని క్షమించమన్నాను.

అంతలోనే వెయిటింగు రూము నుండి కరుణాకరం డ్రైవరుతో కబురు చేశారు, వీరభద్రాన్ని తనను చూడకుండా వెళ్లిపొమ్మని.

వీరభద్రం, చివరి కోరికగా పాపను చూచి వెళతానన్నాడు. వీరభద్రాన్ని చూస్తే కరుణాకరం ఆవేశ పడవచ్చు. అసలే వ్యాధిగ్రస్తుడు. వద్దు వెళ్లిపొమ్మన్నాను.

వీరభద్రం కనుల నీరు పారలి ప్లాట్ ఫారం మీద పడింది. "సెలవు" అంటూ భారంగా నడిచి వెళ్లిపోయాడు. ఆ అనుబంధానికి ఫలమంతే అనుకున్నాను.

రైలు వచ్చింది. కరుణాకరానికి 'ఆరోగ్యం జాగ్రత్త' అని చెప్పి, నమ్మకం లేని ఆ జీవితాన్ని చివరిసారిగా అన్నట్లు చూచాను. రైలు బయలు దేరింది. కరుణాకరం కనుమరుగైనాడు.

★ ★ ★

గుంటూరు వచ్చాక కొన్ని రోజులకు తెలిసింది, కరుణాకరానికి ఎలాంటి వైద్య సహాయం లేకుండానే ఆరోగ్యం చేకూరిందని. ఆశ్చర్యం కలిగింది. మానవ సంకల్ప వికల్పాలకన్నా అతీతమైన శక్తి పట్ల నా విశ్వాసం పుంజీభూతమయింది.

కరుణాకరం హృషీకేశం, బదరి ప్రయాణమై వెళ్లారట. వీరభద్రం సన్యాసుల్లో కలిశాడట. అనంత కోటి జన్మలు శ్రమించి, మానవుడు చేస్తున్న ప్రయోగానికి అతీతంగా, ఈ విధి ఎందుకు నిలిచిపోతున్నదో అర్థం కాలేదు.

ఆలోచించాను. అరుణ, కరుణాకరం, వీరభద్రం, నేను - మా నలుగురివి కుదురు తప్పిన బతుకులే! ప్రతి ఒక్కరివి శ్రుతితప్పిన జీవితాలే! మాకుగా మిగిలి ఉన్న పాప జీవితం ఇందుకు భిన్నంగా ఉండాలని ఆశించాను. మా అందరి ఆశయమూ అదే! అందుకే గుంటూరులోని నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను. దూరంగా వెళ్లాను.

నిర్మలత, కరుణ, ధర్మం సంగమించిన చోట, పవిత్ర కృష్ణవేణమ్మ ఒరసి పారినచోట, లీలా మాత్రంగా సముద్రుడు సుదూరం నుండి దర్శన మిచ్చే ప్రదేశంలో ఒక కుటీరాన్ని నిర్మించుకొని, పాపతో జీవిత యాత్ర ప్రారంభించాను. పాపను 'శాంతి' అని పిలవడం ప్రారంభించాను.

అక్కడ ఎవ్వరూ కన్పించేవారు కాదు. పాపకు జీవిత పరమార్థాన్ని గురించి,

వెలుగును గురించి, పెంజీకటి కవ్వలి ఆ దివ్యమూర్తిని గురించి పాఠాలు చెప్పుకొంటూ, శాంతిని ప్రసాదించే 'గీత'ను అభ్యసిస్తూ జీవితాన్ని సాగించాను. ●

## కథ వెనుక కథ :

నేనున్న ప్రక్క వీధిలో శ్రీమంతులైన ఓ డెబ్బది ఏళ్ళ ముసలి భర్త - అంతకు సగం వయసున్న భార్య. ఆయన చాల సాధువుగా - జ్ఞానిగా కన్పించేవారు. ఆమెగారు కూడ గొప్ప సౌజన్యవతి. పిల్లలు లేరు. పెంచుకొన్న అమ్మాయి ఎక్కడో హాస్టల్లో వుండి చదువుకొంటోంది అనేవారు. 'ఆ పెంచుకొన్న అమ్మాయి, ఆమెగారి అక్రమ సంతా' నమని అనేవాడు మిత్రుడు సూర్యనారాయణ. నిజమెంతో మరి!

'అది నిజమా?' అనే ఆలోచన చుట్టూ అల్లిన కథ.

*★ (ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 25-11-1964 & 2-12-1964) ★*